క్లుప్తంగా

రూ.399కే పది లక్షల బీమా

కుంటాల: తపాలాశాఖలో ఏడాదికి రూ.399 చెల్లిస్తే రూ.10లక్షల బీమా వర్తిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఐపీఓ షఫీఉద్దీన్ అన్నారు. బుధవారం కుంటాలలో తపాలా అందించే బీమా, పొదుపు సేవలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఆడ పిల్లలున్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా రూ.200నుంచి 2వేల వరకు చెల్లిస్తే లాభాలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ఓలా సర్పంచ్ కనీస్ ఫాతిమా, ఎస్పీఎం మధుకర్, ఎంవో శ్రీకాంత్, సిబ్బంది నరేష్, భూషణ్, అఖిల్ రెడ్డి, శ్రీకర్‌రెడ్డి, సిద్ధార్థ, హైమద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే

లోకేశ్వరం: విద్యార్థులు సమయం వృథా చేయకుండా శ్రమించడం ద్వారానే విజయం సాధిస్తారని ప్రిన్సిపాల్ తుకారం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, నాటికలు, మిమిక్రీలు ఆకట్టుకోగా విజేతలకు బహుమతులు అందించారు. అధ్యాపకులు చిన్నయ్య, వినోద్, విఠల్, శ్రీనివాస్ ఉన్నారు.

'కాంగ్రెస్‌కే అధికారం ఇవ్వాలని ప్రచారం'



తాంద్రలో ప్రచారం చేస్తున్న నాయకులు

సారంగాపూర్: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కే అధికారం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు కుమార్తె మాధురి అన్నారు. మండలంలోని తాంద్ర(జి) గ్రామంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకే అందుతున్నాయని.. సామాన్యుడికి అందడం లేదని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పి.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కే పట్టం కట్టాలని ఓటర్లను కోరారు. దశరథ రాజేశ్వర్, మారుతి, సునీత, సలీమ్, సురేందర్, తదితరులు ఉన్నారు.

భక్తుల పాదయాత్ర



నిర్మల్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ), బాబాపూర్ గ్రామాలకు చెందిన దుర్గామాత దీక్షాపరులు 12 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి నిర్మల్ పట్టణంలోని శ్రీ నందిగుండా దుర్గామాతను దర్శించుకున్నారు. అంతకుముందు తమ గ్రామాల్లో దుర్గాదేవి ప్రతిమలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మహిపాల్, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: వైఎస్సార్‌టీపీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లోక లక్ష్మారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము అన్నారు. బుధవారం పట్టణంలో పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకులతో మాట్లాడారు. పార్టీ అధినేత షర్మిల నాయకత్వంలో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీపాద శేషాద్రి, పట్టణ అధ్యక్షుడు పానగంటి నరేశ్, కొత్తూరి పురుషోత్తం, అజ్గర్, గోవింద్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన గురిజల చిన్నయ్య(60) బుధవారం రాత్రి తన పొలం వద్ద తాగిన మైకంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి బంధువుల వివరాల ప్రకారం ఆలూరుకు చెందిన చిన్నయ్య మద్యానికి బానిసై నిత్యం ఇంటికి తాగి వచ్చేవాడు. బుధవారం తాగి వచ్చి కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం పొలం వద్దకు వెళ్లి ఉరేసుకున్నాడు. గమనించిన ఆయన కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

యాసంగి సాగుకు సన్నద్ధం

- పనులు ప్రారంభించిన రైతన్నలు
- అవగాహన సదస్సులు చేపట్టని వ్యవసాయాధికారులు
- సబ్సిడీపై విత్తనాలు అందించాలని వేడుకోలు



తానూరు మండలం బెల్‌తరోడాలో విత్తనాలు విత్తేందుకు చేనును సిద్ధం చేస్తున్న రైతులు

తానూరు: వానాకాలంలో సాగు చేసిన పంటలు చేతికి రావడంతో జిల్లా రైతులు యాసంగి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే భూములను దున్ని శనగ, పెద్దజొన్న, గోధుమ, వేరుశనగ విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్ పరిస్థితులను బట్టి ఏయే పంటలు సాగు చేయాలో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

అధిక వర్షాలతో రాని దిగుబడులు..

భైంసా డివిజన్‌లోని ఏడు మండలాల్లో వ్యవసాయాధికారుల వివరాల ప్రకారం వానాకాలంలో 90 వేల ఎకరాల్లో సోయా, 400 ఎకరాల్లో పెసర, 600ఎకరాల్లో మినుము పంటలు సాగు చేశారు. వానాకాలం పంటలను నష్టపోయామని.. యాసంగిలోనైనా అధిక దిగుబడులు సాధించి అప్పులు తీర్చాలనే లక్ష్యంగా పనులు చేపట్టారు. తానూరు, ముథోల్, భైంసా, కుభీర్, బాసర మండలాల్లో అధికంగా శనగ, పెద్దజొన్న, వేరుశనగ, గోధుమ పంటలను సాగు చేస్తారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురువడంతో భూమిలో తేమశాతం ఉందని.. యాసంగి సాగునీటికి ఢోకా ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

సబ్సిడీ ఎత్తేసిన ప్రభుత్వం..

యాసంగిలో నాటేందుకు ఇప్పటికే 80 శాతం మంది రైతులు శనగ విత్తనాలు తెచ్చుకున్నారు. గతంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు అందించేది. మూడేళ్ల కిందట సబ్సిడీ తొలగించడంతో రైతులు 25 కిలోల శనగ విత్తనాల బస్తా రూ.1800కు ప్రైవేటు వ్యాపారుల నుంచి తెచ్చుకుంటున్నారు. సబ్సిడీ అందిస్తే 25 కిలోల బస్తా కేవలం రూ1,100కే అందించేవారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే తానూరు, కుభీర్, బాసర, భైంసా, ముథోల్ మండలాల్లో రైతులు విత్తనాలు నాటుకోవడంలో బిజీగా మారారు.

పనులు ప్రారంభమైనా అవగాహన కరువు..

ఏటా వ్యవసాయధికారులు గ్రామాల్లో రైతుసభలు నిర్వహించి భూముల్లో తేమశాతం ఆధారంగా ఏయే పంటలు సాగు చేసుకోవాలో సలహాలు సూచనలు అందించేవారు. కానీ ఈ ఏడాది యాసంగి పంటల సాగు ప్రారంభమైనా అధికారులు అవగాహన కల్పించడం లేదు. ఇప్పటికైనా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

తానూరుకు పూర్తిస్థాయి ఏవో లేడు..

తానూరు మండలానికి రెగ్యులర్ ఏవో (మండల వ్యవసాయాధికారి) లేకపోవడంతో లోకేశ్వరం మండల ఏవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కానీ సదరు అధికారి ఒక్కరోజు కూడా తానూరు మండలంలో పర్యటించిన దాఖలాలు లేవు. దీంతో మండలంలోని రైతులంతా ముథోల్, లోకేశ్వరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తెగుళ్ల నివారణకు చేపట్టే సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించేవారు లేక దిగుబడులు నష్టపోతున్నామని మండల రైతులు వాపోతున్నారు.

రైతులకు రుణాలిస్తున్నాం

ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ చేసిన రైతులకు మళ్లీ రుణాలిస్తున్నాం. రైతులు యాసంగి పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించొద్దు. రుణం కావాల్సిన వారు సమీపంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలి.

– నారాయణరావ్ పటేల్, హంగిర్గా పీఏసీఎస్ చైర్మన్

అవగాహన కల్పిస్తాం

గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటలపై అవగాహన కల్పించేవాళ్లం. గత మూడేళ్లుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఈసారి గ్రామాల్లో ఏఈవోల ద్వారా యాసంగి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తాం. త్వరలో తానూరు ఏవో పోస్టును భర్తీ చేస్తాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అవగాహన కల్పించాలి



యాసంగిలో సాగు చేసే పంటలపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలి. తెగుళ్ల నివారణకు సూచనలు అందించి రైతుల సమస్యలు పరిష్కరించాలి. మా తానూరు మండలానికి పూర్తిస్థాయి ఏవోను నియమించాలి.

– మల్లాయి రాజు, భోసి

సబ్సిడీ విత్తనాలు అందించాలి



గతంలో మాదిరి ప్రభుత్వం శనగ విత్తనాలను సబ్సిడీపై అందించాలి. మూడేళ్లుగా సబ్సిడీ తొలగించడంతో అధిక ధరలకు విత్తనాలు కొంటున్నాం. శనగ, పెద్దజొన్న విత్తనాలు మహారాష్ట్ర నుంచి అధిక ధర చెల్లించి తెచ్చుకుంటున్నాం.

– కాషా రవి, బెల్‌తరోడా

సాదాసీదాగా సమావేశం

దస్తురాబాద్: ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సింగరి కిషన్ అధ్యక్షతన నిర్వహించిన దస్తురాబాద్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి వైద్య, వ్యవసాయ, వాటర్‌గ్రిడ్, రెవెన్యూ, విద్యుత్‌శాఖల అధికారులు మాత్రమే హాజరవగా.. మిగతా శాఖల వారు గైర్హాజరయ్యారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గంట లోపే సమావేశం ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ తెలంగారావ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు రఫిక్ అహ్మద్, ఆత్మ వైస్ చైర్మన్ అప్పనిరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పథకాలను చూసి బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోన్ మండలం సిద్దులకుంట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, భూమారెడ్డి, గంగారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మామడ మండలం కొరిటికల్ గ్రామస్తులు పలువురు సైతం బీఆర్‌ఎస్‌లో చేరారు.

అభివృద్ధి చూసి గెలిపించండి

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

తానూరు: నేను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని విఠలేశ్వర, మహాలక్ష్మి, సాయిబాబా ఆలయాల్లో పూజలు చేశారు. అంబేద్కర్, అన్నబావు సాతే చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీధుల్లో రథంతో ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల విద్యుత్, అర్హులకు పింఛన్లు, రైతుబీమా, రైతుబంధు పథకాలకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పోతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, సర్పంచ్ విఠల్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

భైంసా: ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని ముథోల్ ఎంపీపీ అయేషాఅఫ్రోజ్‌ఖాన్ కోరారు. బుధవారం ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

లోకేశ్వరం: నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని.. కఠిన చర్యలు తీసుకుంటామని ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హవర్గ గ్రామ సమీపంలోని అర్లి వంతెన వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాదారులు అన్ని పత్రాలు వెంట ఉంచుకొని నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, పోలీసులు ఉన్నారు.

సామాన్యుడి ఆయుధం ఓటుహక్కు..

నిర్మల్‌టౌన్: సామాన్యుడి ఆయుధం ఓటుహక్కు అని.. ప్రలోభాలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ పట్టణ సీఐ పురుషోత్తం సూచించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడలో నాకాబంది(తనిఖీలు) నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. పట్టణ ఎస్సైలు శంకర్, రాజేశ్వర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంకుమార్చనలు, పూజలు



ఖానాపూర్‌లో బోనాలు, దివ్యాంగులతో విద్యార్థులు

ఖానాపూర్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని త్రిశూల్ సేన కమిటీతోపాటు శివసేన దుర్గామాత మండళ్ల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బోనాల ఊరేగింపును వేర్వేరుగా నిర్వహించారు. డీజే చప్పుళ్ల నడుమ మహిళలు, చిన్నారులు నృత్యాలు చేశారు. అనంతరం దుర్గామాతకు నైవేద్యం సమర్పించారు. బాదన్‌కుర్తి పంచాయతీలోని చింతల్‌పేట్ దుర్గాదేవి మండపం వద్ద బుధవారం మహిళలు కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు.

బోనాలతో మొక్కులు..

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కుర్మెవాడలో దుర్గాదేవి దీక్షాపరులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దస్తురాబాద్: మండలంలోని కొత్తగూడెం గ్రామంలోని దుర్గాదేవి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. పండితుడు నరేషాచార్యుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. లింబా(కె)లో దీక్షాపరులు పూజలు నిర్వహించారు. మండపాల వద్ద అన్నదానం చేశారు.

సోన్: మండలంలోని పాక్‌పట్లలో బుధవారం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు తెంబరేని కళాకారుల బృందంతో నల్ల పోచమ్మ ఆట ప్రదర్శన జరుగుతుందని మణికంఠ యూత్ సభ్యులు తెలిపారు.

కడెం: మండలంలోని లింగాపూర్, కడెం, పెద్దబెల్లాల్, మాసాయిపేట్ తదితర గ్రామాల్లో శరన్నరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని రామాలయంలో నిర్వహించిన చండీయాగంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారి రాజ్‌కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.



లోకేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు



దస్తురాబాద్‌లో కుంకుమార్చనలో భక్తులు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరా, లోకేశ్వరం, పంచగుడి, పుస్పూర్, గొడిసెరా, పిప్రి, గడ్‌చాంద గ్రామాల్లో దుర్గాదేవి మహాలక్ష్మి రూపం భక్తులకు దర్శనమిచ్చింది. ఈసందర్భంగా మండపాల వద్ద భక్తులు హోమం నిర్వహించారు. అంతకుముందు మహిళలు మంగళహారతులతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు



కుభీర్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



నిర్మల్‌లో చాణక్య కళాశాల విద్యార్థులు



లక్ష్మణచాందలో బతుకమ్మలతో విద్యార్థులు

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతకమ్మను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. ప్రిన్సిపాల్ సునీల్, మాధురి, సంపత్, విజయ్, భాస్కర్, రమేశ్, లింగయ్య, అశోక్, శివరాజ్, గజేందర్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని సహకార జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురా లు నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మ పాట లు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిష్టయ్య, రాజేశ్వర్, శ్రీనివాస్, భోజన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.

చాణక్య కళాశాలలో..

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని చాణక్య జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లోల దివ్యారెడ్డి గౌరమ్మలకు ప్రత్యేక పూజలు చేసి విద్యార్థినులతో కలిసి ఆడి పాడారు. అనంతరం ధర్మసాగర్ చెరువులో నిమజ్జనం చేశారు. ఇందులో కరస్పాండెంట్ నర్సారెడ్డి, ప్రిన్సిపాళ్లు జనార్దన్ రెడ్డి, గోవర్ధన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తూ బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్మల్ నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులు బీజేపీలో చేరారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నర్సాపూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్‌లు, గంగపుత్ర సంఘ సభ్యులు, ఆజాద్ యూత్ సభ్యులు, సారంగాపూర్ మండలం మహావీర్‌తండా, అడెల్లితండా, బండరేవ్‌తండా, బోరిగాం, జౌలి గ్రామాలకు చెందిన వంద మందికి పైగా మామడ మండలం కోరిటికల్‌కు చెందిన మాజీ ఎంపీపీ దేవలలిత చక్రపాణి, గంగపుత్ర సంఘ సభ్యులు కొంద్ర నర్సయ్య, కొంద్ర రంజిత్, భూమన్న, యాదవ సంఘ సభ్యులు, పద్మశాలి సంఘ సభ్యులు, దళిత సంఘ సభ్యులు, నిర్మల్‌రూరల్ మండలం ముజ్గి, రాణాపూర్ తండా గ్రామాల నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు బాపురెడ్డి, చిన్నారెడ్డి, నర్సారెడ్డి, లింగారెడ్డి, గోవర్ధన్, రమేశ్‌రెడ్డి, నర్సారెడ్డి, నారాయణ్‌రెడ్డి, లచ్చన్న, రాజేశ్వర్ నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన పలువురు చామన్‌పెల్లి వాసులతో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

చామన్‌పెల్లి వాసుల చేరిక..

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామం నుంచి పలు కులసంఘాల సభ్యులు, మహిళలు 300 మందికి పైగా బీజేపీలో చేరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో మహేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గోవర్ధన్, లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మల్లేశ్, గంగన్న, రాజేశ్వర్, శ్రీను కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

భైంసాటౌన్: చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు బుధవారం భైంసా పట్టణంలోని ఏరియాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సాహెబ్‌రావు, వాడేకర్ లక్ష్మణ్, శేఖర్, తదితరులున్నారు.

'ముథోల్‌లో కాషాయజెండా ఎగురవేయాలి'

- అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశంలో బెంగళూరు ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్

భైంసాటౌన్: వచ్చే ఎన్నికల్లో ముథోల్‌లో బీజేపీ గెలుపు కోసం క్షేత్రస్థాయి నుంచి కృషి చేయాలని బెంగళూరు ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం భైంసాలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జిలు, మండలాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులతో అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని.. పని చేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావుపటేల్, అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్ తదితరులున్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

సోన్: వినియోగదారులు ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించి సమయం ఆదా చేసుకోవాలని ఏడీఈ రవి, ఏఈ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బొప్పారంతోపాటు పలు గ్రామాల్లో ఆన్‌లైన్ విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై అవగాహన కల్పించారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా చెల్లించాని సూచించారు. లైన్‌మెన్ గంగాధర్, జేఎల్ఎం ఇలీయాస్ తదితరులున్నారు.

కడెం: మండల కేంద్రంతోపాటు మండలంలోని పాండ్వపూర్ తదితర గ్రామల్లో ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పేటీఎం, ఫోన్ పే, గూగుల్‌పే వంటి యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించాలని కోరారు. ఇందులో సబ్ ఇంజినీర్ స్వాతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.



సోన్: బొప్పారంలో మాట్లాడుతున్న అధికారులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించే విధానంపై ఏఈ రాంబాబు అవగాహన కల్పించారు. బిల్లులు చెల్లించేందుకు కార్యాలయానికి వచ్చి సిబ్బంది కోసం నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించాలని కోరారు. సుదర్శన్, కుమారస్వామి, సంజీవ్ తదితరులు ఉన్నారు.

కుంటాల: వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఏఈ శివప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ఓలాలో ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే విధానం వివరించారు. హైమద్ పాషా, శ్రీనివాస్ గౌడ్, సదాశివ్, మహేందర్, శంకర్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని గొడిసీర్యాలలో ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై ఏడీఈ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన బిల్లులు చెల్లించే తీరును వినియోగదారులకు వివరించారు. కార్యక్రమంలో సబ్‌ఇంజినీర్ నాగరాజు, సిబ్బంది రాజు, శ్రీనివాస్, గంగన్న తదితరులు ఉన్నారు.

రికార్డుల తనిఖీ

కుంటాల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్వల్ప, దీర్ఘకాలిక, రుణాలు, ఎరువులు, విత్తనాలు, వరి,మొక్కజొన్న కొనుగోళ్ల రికార్డులను ఆడిటర్ తోఫిక్ హుస్సేన్ ,సిబ్బంది పరిశీలించారు.